


## మామయ్యా దొంగ

మాస్కూలు పరీక్షలు అయిపోయి నవి శలవులు ఇచ్చేరు. మా స్నేహితుడు వాళ్ళ ఊరు వెళ్లిపోవుచున్నాడు అందుచే బస్స్ స్టాన్డ్ వరకు దిగ బెట్టుటకు బయలు తేరితిని. ఇంతలో చిన్న చినుకులు రాలడముతో ఇంట్లోంచి గొడుగు తీసుకొని నేను మా ఫ్రెండు రాము బస్సు స్టేండుకు వెళ్లేము తీరా వెళ్లేటప్పట్కి ఇంకా బస్సు రావడము లేదు. అందుచే వెయిటింగ్ హాలులో కూర్చున్నాము. ఇంతలో మా ప్రక్కన వున్న ఓ పెద్ద మనిషి అయ్యా మీ గొడుగు ఇస్తారా ఒంటేలుకి వెళ్లి వస్తాను అని అడిగేడు సరే కదా అని ఇచ్చేను. తన చేతినున్న చిత్రగుప్త నాకిస్తూ (నా నమ్మకం కొరకు) నా గొడుగు తీసుకొని వెళ్లేడు. ఇంతలో బస్సు వచ్చింది. మా ఫ్రెండుని ఎక్కించి నా గొడుగు పట్టుకెళ్లిన పెద్ద మనిషి కొరకు చూస్తున్నాను $\frac{1}{2}$ గంట చూచేను. రాలేదు చేయునదిలేక మనస్సు పీకుతున్నప్పట్కి (ఇంటికి వెళ్తే ఏమౌతుందో యని) ఇల్లు చేరుకున్నాను. తీరా ఇంట్లో అడుగు పెట్టే టప్పట్కి గొడుగు తీసుకెళ్లిన పెద్ద మనిషి కనిపించేడు. ఇంతలో అమ్మ వచ్చి నాయనా! ఇదిగోరా మీ మిలటరీ మామ. నీ చిన్నప్పుడు మిలటరీకి వెళ్లిపోయాడు అని చెప్పింది. నన్ను చూచి ఆ పెద్ద మనిషి మామ నిశ్చేష్టుడై పోయేడు.

—ప్రతాప్.

## ఏ అబ్బాయి-ఏ అమ్మాయి

రాము చిలిపి కుర్రవాడు. ఎవరినైన ఉడికించడమంటే అతని కెక్కువ సరదా. ఒక అబ్బాయి పోతుండడము చూచి రాము 'ఏ అబ్బాయ్' అని తొందరగా పిలిచాడు. ఆ అబ్బాయి తిరిగి చూచి రాము దగ్గరకు వచ్చి "ఎందుకు పిలిచావు" అని కోపముతో అడగ్గా రాము, అది కాదు ఏబై, అరవై, డెబై అని గుణించుకుంటే అలా నీకు ఏ అబ్బాయి అని వినిపించింది. ఇది వినే సరికి ఆ అబ్బాయి తెల్ల ముఖంతో వెళ్లిపోయాడు. రాము వాన్ని పల్టీ కొట్టించి నందుకు సంతోషముతో యింటికి వెళ్లిపోయాడు.

ఒకనాడు ఒక అమ్మాయి దారిని పోతుండగా రాము తమాషాకి ఏ అమ్మాయ్ అని పిలిచాడు. ఆ అమ్మాయి తిరిగి ఎందు కబ్బాయి పిలిచావు? అని అడగ్గా; నిన్నెవరు పిలిచారు? మా మాస్టరుగారు (am I) ఏమ్ ఐ నేను ఉన్నాను అని చెప్పారు దాన్ని చదువు కొంటే నీకు ఏ అమ్మాయ్ అని వినిపించింది.

అనేసరికి ఆ అమ్మాయి బిక్క ముఖముతో వెళ్లిపోయింది. ఇద్దర్నీ తమాషాగా పల్టీకొట్టి అనాటికి సంతోషంతో రాము ఇంటికి వెళ్లిపోయాడు.

—బి. ఎ. ఆర్. ఎస్. రెడ్డి.

## మా ఆవిడ ఆదా

మా ఆవిడ ఎన్నాళ్ళనుంచో బాగా ఆదాచేద్దామనుకుంటూ వుండేది. ఆ సంగతే నాతో పదేపదే చెబుతూ వుండేది గూడ!

ఆ రోజు ఫస్టు తారీకు. "ఏమండోయ్! ఈ తడవకి ఒక అగ్గిపెట్టె మాత్రం తీసుకురండి" అంది. "ఏం" అన్నాను ఆశ్చర్యంగా, "ఏమీ లేదు. ఈ నెల నుంచి ఒక్క అగ్గి పెట్టెతో సరిపుచ్చుదామనుకుంటున్నాను" అంది. నాకు నవ్వాగింది కాదు. అంటే మా ఆవిడ పొదుపు వుద్యమాన్ని మొట్టమొదట అగ్గిపెట్టెతో ప్రారంభించిందన్న మాట! దాని మాటతీసి పారెయ్యటం ఎందుకని 'సరే!' అన్నాను.

ఆ రాత్రి మా ఆవిడ పాలు కాయటానికి ఒక అగ్గిపుల్ల ముట్టించి 'స్టవ్' వెలిగించి, మళ్ళీ ఎందుకైనా పనికి వస్తుందని తిరిగి అగ్గిపెట్టెలో పెట్టేసింది ఆ అగ్గిపుల్లని. వెంటనే ఆ స్టవ్‌కి ఏ మొచ్చిందో గాని ఒక్కసారి ఆరి పూరుకుంది.

మా ఆవిడ తిరిగి అగ్గిపెట్టె తీసేసరికి "భగ్గు" మని ఒక్కసారి అందులో వున్న అగ్గిపుల్లలతో సహా అగ్గిపెట్టె భస్మమై పోయింది.

నాకు నవ్వాగక "ఒసేవ్! నీ ఆదా చాలు గాని, నా లెక్కప్రకారం నీకు నెలకు అరడజను అగ్గిపెట్టెలు వుండాల్సిందే! అన్నాను.

ఇక ఏడవలేక నవ్వింది మా ఆవిడ ఒక చిరునవ్వు.

—కె. యస్. గిరీశ్వరరావు.